తారు ఎప్పుడు వేస్తారు సారూ!

- పెద్ద వాగు రోడ్డుపై తేలిన కంకర
- తారు వేయడం మరిచిన అధికారులు


పెద్దవాగు రోడ్డుపై గుంతల్లో వేసిన కంకర

బాల్కొండ: జాతీయ రహదారి 44 ముప్కాల్ మండలం నల్లూర్ నుంచి పెద్ద వాగు రోడు డపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ఆ గుంతల్లో కంకర వేశారు. కాని తారు వేయడం మరిచారు. దీంతో తారు ఎప్పుడు వేస్తారు సారూ అంటూ ప్రయాణికులు అడుగుతున్నారు. పెద్ద వాగు రోడ్డు వరకు డబుల్ రోడ్డు కావడంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ముప్కాల్ మండల కేంద్రం శివారులో కొత్తపల్లి వద్ద పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతలకు ప్యాచ్ వర్క్ చేయడంలో భాగంగా కంకర వేశారు. ప్రస్తుతం కంకరపై ప్రయాణించాలంటే జంకుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తారు వేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

అటకెక్కిన పునరుద్ధరణ పనులు

పెద్ద వాగు రోడ్డు పునరుద్ధరణ పనులు అటకెక్కాయి. రోడ్డు పునరుద్ధరణ కోసం గత ప్రభుత్వం రూ.4.20 కోట్ల నిధులను మంజూరు చేసింది. శంకుస్థాపన కూడా చేశారు. ఆరు నెలలు గడిచినా ఇప్పటి వరకు పనులు ప్రారంభానికి నోచుకోలేదు. పునరుద్ధరణ పనులు చేపడితే ప్యాచ్ వర్క్‌లు చేసే అవసరం లేదు. పనరుద్ధరణ పనులు పత్తా లేకపోవడం వల్లనే ప్యాచ్ వర్కులతో సరిపెడుతున్నారు. పెద్దవాగు రోడ్డు గుండా వాహనాల రద్దీతో పాటు పలు గ్రామాలు ఉండటంతో ప్రయాణికుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. సంబంధిత అధికారులు ప్యాచ్ వర్కులు అయిన వెంటనే చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమం కోసమే నా పోరాటం

- ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు

మాక్లూర్: ప్రజల సంక్షేమం కోసమే అధికార పార్టీతో పోరాటం చేస్తున్నానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్మూర్ ప్రజలు బీజేపీ అభ్యర్థినైన నన్ను గెలిపించారన్న ఒకే ఒక కారణంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆర్మూర్ అభివృద్ధిపై వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. సోమవారం బొంకన్‌పల్లి, ముల్లంగి(బి) గ్రామాల రైతులకు నీరందించటమే లక్ష్యంగా రూ.11 కోట్ల 70 లక్షల వ్యయంతో లక్మాపూర్ వద్ద చేపట్టిన మినీ లిఫ్టు పనులను ప్రారంభించిన అనంతరం పైడి రాకేశ్ రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యేగా తాను ఉండగా నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ నేత ఒకరు ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కుతూ గుట్టుగా వ్యవహారాలు నడుపుతున్నారని మండిపడ్డారు. ఆ నేత ఎన్ని జిమ్మిక్కులు చేసినా నియోజకవర్గ అభివృద్ధి అనేది తనతోనే సాధ్యం అన్నారు. తాను అధికార పార్టీతో పోట్లాడుతూ నిధులు తెప్పించుకుంటానని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిధులన్నీ కొడంగల్‌కే తరలించుకుపోతున్నారని ఆరోపించారు. భోజనం పూర్తిగా తిని ఎంగిలి విస్తరి పారేసినట్లు మనకు విసురేస్తున్నారన్నారు. దీన్ని నేను ఎంత మాత్రం సహించబోనని చెప్పారు. అందుకే అమరణ నిరహార దీక్ష చేయటానికి తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నానని అన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడారు. మాక్లూర్ విండో చైర్మన్ బూరోళ్ల అశోక్‌రావు, బీజేపీ ఆర్మూర్ నేత కంచెట్టి గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవి ప్రకాష్, ఎంపీటీసీ పురుషోత్తంరావు, ఎంపీడీవో క్రాంతి, తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్కొండ ఎస్సైగా యాసిర్ అరాఫత్

బాల్కొండ: బాల్కొండ ఎస్సైగా యాసిర్ అరాఫత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్సైగా విధుల నిర్వర్తించిన గోపి నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతన ఎస్సైకి సిబ్బంది స్వాగతం పలికారు.

వర్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఠాగూర్

వర్ని: వర్ని లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఠాగూర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సోమ వారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రధాన కార్యదర్శిగా జాస్తి శ్రీనివాస్, కోశాధికారిగా కటకం శివరాజులను ఎన్నుకున్నట్లు ఠాగూర్ తెలిపారు.

'పోచారం వెంటే నడుస్తాం'



వర్ని(చందూర్): బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని సోమవారం చందూర్, మోస్రా మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కలిశారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో రెండు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డిని కలిసి ఆయన బాటలోనే నడుస్తామని మద్దతు ప్రకటించారు. మోస్రా జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, చందూరు జెడ్పీటీసీ అంబర్ సింగ్, ఎంపీపీ లావణ్యారాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు హనుమంతరెడ్డి, అంబర్ సింగ్ పాల్గొన్నారు.

పూజా సామగ్రి దుకాణం వేలం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయం ఆవరణలోగల పూజా సామగ్రి దుకాణాన్ని 2 సంవత్సరాల కాల పరిమితి లీజును పట్టణానికి చెందిన టి. శంకర్ రూ.2 లక్షల 70 వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు. పట్టణంలోని ఏక చక్రేశ్వర శివ మందిరంలో సోమవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పూజా సామగ్రి దుకాణ వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో ఐదుగురు సభ్యులు పాల్గొన్నారు. అత్యధికంగా వేలం పాడి దుకాణాన్ని లీజుకు శంకర్ దక్కించుకున్నారని ఆలయ ఈవో రవీందర్ గుప్తా తెలిపారు. పర్యవేక్షణ అధికారి లక్ష్మణ్, జూనియర్ అసిస్టెంట్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం



వేల్పూర్: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. పచ్చలనడ్కుడ సొసైటీలో సోమవారం రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డిని సొసైటీ చైర్మన్ లింబారెడ్డి, డైరెక్టర్లు శాలువాతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన తర్వాత తొలిసారిగా సొసైటీ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆయనను సన్మానించారు. అనంతరం రైతుల అభిప్రాయాలు స్వీకరించారు. భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య, ఏవో నర్సయ్య, సొసైటీ కార్యదర్శి స్వామి, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

భీమ్‌గల్: పురాణిపేట్ గ్రామంలో వారం రోజుల క్రితం ప్రారంభమైన డివిజన్ స్థాయి సర్కిల్ టౌర్నమెంట్ సోమవారం ముగిసింది. విజేతగా పురాణిపేట్ నిలువగా, బాబాపూర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన బాబాపూర్ జట్టు 6 ఓవర్లలో 65 పరుగులు చేయగా, పురాణిపేట్ జట్టు 5.3 ఓవర్లలో చేధించింది. విజేతగా నిలిచిన పురాణిపేట్ జట్టు కు రూ.8 వేలు, బాబాపూర్ జట్టుకు రూ.4 వేలు అందజేశారు. నిర్వాహకులు చరణ్, అజయ్, హరీష్ పాల్గొన్నారు.

కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి

భీమ్‌గల్: మండలంలోని బెజ్జోరా, లింగాపూర్ గ్రామాలను ఎంపీడీవో సంతోష్ కుమార్ సోమవారం సందర్శించారు. హరితహారం, డంపింగ్ షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగాలను నివారించడానికి నిల్వ నీటిని తొలగించాలని, మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని తెలిపారు. హరితహారం యాక్షన్ ప్లాన్ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

రెంజర్లలో మహాజన సభ

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల సొసైటీలో సోమవారం చైర్మన్ కోమటిశెట్టి గంగాధర్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మానిటరింగ్ అధికారి దినేష్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు పథకంపై రైతులు తమ విలువైన సూచనలు అందించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ సంతోష్, డైరెక్టర్లు, సీఈవో గంగాధర్ పాల్గొన్నారు.

దత్తాపూర్ పెద్ద చెరువు హద్దుల పరిశీలన


చెరువును పరిశీలిస్తున్న అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): దత్తాపూర్ పెద్ద చెరువు హద్దులను తహసీల్దార్ వెంకటరమణ సోమవారం పరిశీలించారు. శిఖం భూమి ఆక్రమణకు గురవుతుందని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కలిసి ఇటీవల సర్వే నిర్వహించిన సంగతి తెలిసిందే. ఐతే, సర్వేయర్ కిషన్‌తో కలిసి సోమవారం శిఖం భూమి హద్దులను నిర్ణయించారు. శిఖంలో కొంత భూమి ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించారు. కానీ, హద్దులు చూపెట్టిన సర్వేయర్ చెరువుకు సంబంధించిన 106 ఎకరాలు ఉందో లేదో స్పష్టత ఇవ్వకపోవడంతో గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. చూపెట్టిన హద్దులు సక్రమంగా లేవని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. మరో పక్క చెరువు ప్రాంతంలో నిర్మిస్తున్న రైస్‌మిల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ ఉందని ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణం చేపట్టడం సరికాదని వారు పేర్కొంటున్నారు.

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శంకర్

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులపై అవగాహన కల్పించారు. పాఠశాల ఆరోగ్య విద్య బోధకుడు శంకర్ మాట్లాడుతూ.. మలేరియా, చికెన్ గున్యా, డెంగీ, ఫైలేరియా, ఎన్‌సెఫలైటిస్ తదితర వ్యాధుల గురించి వివరించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఫ్రైడే డ్రైడేగా పాటించాలని, విద్యార్థులు జ్వరం వస్తే ఆలస్యం చేయకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్‌ఎం సాయన్న, ఉపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య, నాగభూషణం, ఏఎన్‌ఎం స్వరూప, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, పాల్గొన్న నాయకులు

బోధన్: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్‌బీ(ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్) జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆయన మాట్లాడారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమై 19 రోజులు గడిచినా సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, దుప్పట్లు, బ్యాగులు, పెట్టెలు ప్రభుత్వం అందించలేదని గుర్తు చేశారు. ఖాళీగా ఉన్న వార్డెన్, వాచ్‌మెన్, వర్కర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. స్థానికంగా ఉండకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వర్తిస్తున్న వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు గంగాప్రసాద్, శ్రీను, నరేష్, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించాలి


ఆందోళనకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

రెంజల్(బోధన్): డబుల్‌బెడ్ రూం ఇళ్లు అందించాలని కందకుర్తి గ్రామానికి చెందిన దరఖాస్తుదారులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామస్తులు గ్రామ శివారులో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్దకు చేరుకుని తమకు న్యాయం చేయాలని కోరుతూ నవీపేట్–కందకుర్తి ప్రధాన రోడ్డు బైఠాయించారు. జిల్లా అధికారులు వచ్చి న్యాయం చేసే వరకు ఆందోళన విరమించబోమని పట్టుబట్టారు. ఎంఆర్ఐతో పాటు పోలీసులు వచ్చి ఆందోళనకారులతో చర్చించినా దరఖాస్తుదారులు వినిపించుకోలేదు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ గ్రామానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులు తాజాగా దరఖాస్తు చేసుకుంటే విచారణ చేపట్టి జిల్లా అధికారులకు నివేదికను అందిస్తామని వివరించడంతో ఆందోళన విరమించారు.

ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో ఏఈల వాగ్వాదం

- వాదనలు మాని సమస్య పరిష్కరించాలని ఎంపీటీసీల హితవు


కోటగిరి మండల సభలో ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులను సన్మానించిన అధికారులు

రుద్రూర్: కోటగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ వల్లెపల్లి సునీతాశ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యుత్ అంశంపై చర్చిస్తుండగా ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో ఏఈల మధ్య వాగ్వివాదం జరిగింది. సుంకిని– కొల్లూర్ రహదారి పక్కన విరిగిన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉందని స్థానిక ఎంపీటీసీ సభ దృష్టికి తీసుకురాగా పై రెండు శాఖల అధికారులు సమస్యను ఒకరిపై మరొకరు నెట్టి వేయడం గమనర్హం. చివరకు ఎంపీటీసీలు జోక్యం చేసుకున్నారు. వాదనలు మాని రెండు శాఖల అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని హితవు పలికారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎంపీటీసీలు సభలో ప్రస్తావించారు. త్వరగా పరిష్కారించాలని అధికారులను కోరారు. సమావేశంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పదవులు శాశ్వతం కావు: ఎంపీపీ

ప్రజాప్రతినిధులకు ప్రజాసేవే ముఖ్యమని పదవులు శాశ్వతం కావని కోటగిరి ఎంపీపీ సునీత అన్నారు. ఎంపీటీసీల పదవీ కాలం మరో మూడు రోజుల్లో ముగియనున్నందున సోమవారం మండల సభలో సభ్యులను ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఘనంగా సన్మానించారు.

క్యాంపస్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ దుష్యంత్

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో ఈ నెల 3న జెన్‌పాక్ట్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్యాంపస్ సెలక్షన్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్ దుష్యంత్ కోరారు. సోమవారం కళాశాలలో ఆయన మాట్లాడారు. ఆసక్తిగల విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో పాటు ఆధార్ కార్డు, పాస్ పోర్టు ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాళ్లు గంగాధర్, హరికృష్ణ పాల్గొన్నారు.

వైద్యులు దేవుడితో సమానం

అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులు దేవుడితో సమానమని లయన్స్ క్లబ్ సభ్యులు, వక్తలు అన్నారు. సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో వైద్యులను సన్మానించారు. శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ..వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, ప్రతి వైద్యుడు రోగి ప్రాణాలు కాపాడటానికి 100 శాతం నిబద్ధతతో ప్రయత్నం చేస్తారని అన్నారు. – సాక్షినెట్‌వర్క్


బోధన్: లయన్స్ కంటి ఆస్పత్రిలో వైద్యులను సన్మానిస్తున్న బోధన్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు


కోటగిరిలో.. లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ సభ్యులు


బోధన్ సూర్య నర్సింగ్ హోంలో.. శక్కర్‌నగర్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు


బోధన్‌లోని విజయ సాయి హైస్కూల్‌లో.. అచన్‌పల్లి లయన్స్ క్లబ్ ప్రతినిధులు


ఆలూర్‌లో వైద్యుడిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు


వేల్పూర్ పీహెచ్‌సీలో..



వర్నిలో..


డాక్టర్ మధుశేఖర్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆర్మూర్ సభ్యులు


ముప్కాల్ మండల కేంద్రంలో ఆర్‌ఎంపీలకు..


నందిపేటలో ..

గ్రామదేవతలకు జలాభిషేకం



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో గ్రామ దేవతలకు సోమవారం జలాభిషేకం నిర్వహించారు. ముందుగా కాలి నడకన పవిత్ర గోదావరికి వెళ్లి గంగా జలాలను తీసుకు వచ్చారు. అనంతరం గ్రామంలో డప్పు వాయిద్యాలతో, వల గొడుగుతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక కోదండ రామాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

రామాలయ కమిటీ చైర్మన్ ఎన్నిక


ఎన్నికైన దురాజి రవిని సన్మానిస్తున్న సభ్యులు

వేల్పూర్: పచ్చలనడ్కుడలో రామాలయ కమిటీ నూతన చైర్మన్‌గా మాజీ ఎంపీటీసీ దురాజి రవి పటేల్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా ముస్కు చంద్రకాంత్, ఏలేటి గంగారెడ్డి, చేపూర్ మోహన్, సంగు గంగాధర్, చిన్న సాయిలు, బోండ్ల రాజేశ్, భూమన్న, మల్కయ్య, లింగేశ్ ఎన్నికయ్యారు. వీడీసీ, కులసంఘాల సభ్యులు వీరిని ఎన్నుకొన్నారు. నూతన చైర్మన్‌ను మున్నూరుకాపు, గుడాల సంఘం తరఫున సన్మానించారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	కల్కి ఏడి-2898 (తెలుగు) - 9.30, 4.15, 11.00 మహారాజ (తెలుగు) - 1.15, 8.00
స్క్రీన్-2 –	కల్కి ఏడి-2898 (తెలుగు) - 8.00, 11.45, 3.30, 7.15, 11.00
స్క్రీన్-3 –	కల్కి ఏడి-2898 (తెలుగు) - 10.05, 1.50, 5.35, 9.20
స్క్రీన్-4 –	కల్కి-2898 (తెలుగు) - 11.05, 2.50, 6.35, 10.20

కూలీలకు సమగ్ర చట్టం తీసుకురావాలి


నందిపేట తహసీల్దార్ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కమ్మర్‌పల్లి/నందిపేట్(ఆర్మూర్): వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం తీసుకురావాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నందిపేట, కమ్మర్‌పల్లి తహసీల్దార్లు ఆనంద్ కుమార్, ఆంజనేయులుకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.12 వేల పెన్షన్‌ను కూలీలకు అమలు చేయాలని కోరారు. బీడీ, గీత కార్మికులకు నెలకు రూ.2016 ఇస్తున్నట్టుగా వ్యవసాయ కార్మికులకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

సాంకేతిక లోపంతో జాయింట్ కాని పట్టాలు

- 20 నిమిషాలు స్తంభించిన ట్రాఫిక్

నవీపేట: మండల కేంద్రంలోని రైల్వే గేటు సమీపంలో సోమవారం సాయంత్రం నెలకొన్న సాంకేతిక సమస్యతో 20 నిమిషాలపాటు ట్రాఫిక్ స్తంభించింది. మేడ్చల్ నుంచి నాందేడ్ వైపు ప్యాసింజర్ రైలు వెళ్లగా సిబ్బంది ఇరువైపులా గేటు వేశారు. రైలు వెళ్లాక సాంకేతిక లోపం కారణంగా రైలు పట్టాలు సంధానం కాలేకపోయాయి. దీంతో సిబ్బంది 20 నిమిషాలు శ్రమించి ఎట్టకేలకు సమస్యను పరిష్కరించారు.

సమాచారం..

■ రేపు మోస్రా మండల సమావేశం

వర్ని(మోస్రా): మోస్రా మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ వెల్లడించారు. సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరు కావాలని, గడిచిన మూడు నెలల అభివృద్ధి ప్రణాళికను సమావేశానికి తీసుకురావాలని ఎంపీడీవో సూచించారు.

■ విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో నేటి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ సాయి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.